సమస్యలకు కూడలి..

- ఇల్లెందు సుభాష్‌నగర్‌లో రింగ్, డివైడర్ల నిర్మాణంలో లోపాలు
- ఇరుకుగా మారిన రహదారితో జనం అవస్థలు
- జాడలేని టాయిలెట్లు.. కానరాని బస్‌షెల్టర్



భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న రింగ్



సుభాష్‌నగర్ కూడలిలోని ఇరుకు రహదారితో స్తంభించిన ట్రాఫిక్

ఇల్లెందురూరల్: అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేని తనం కారణంగా ఇల్లెందు మండలంలోని అతిపెద్ద గ్రామపంచాయతీ అయిన సుభాష్‌నగర్ కూడలి అసౌకర్యాలకు నిలయంగా మారింది. ఖమ్మం, భద్రాచలం ప్రాంతాల నుంచి ఇల్లెందుకు చేరుకునే బస్సులు, ఇతర వాహనాలు ఇక్కడి నుంచి ఇల్లెందు పట్టణంలోకి ప్రవేశిస్తాయి. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికుల రద్దీతో ఉండే ఈ కూడలిలో కనీస సౌకర్యాలు కూడా కొరవడి ప్రజలు గోసపడుతున్నాయి. భద్రాచలం, ఖమ్మం ప్రాంతాల నుంచి వాహనాలు, కోయగూడెం ఓసీ నుంచి బొగ్గు టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో సహజంగానే సుభాష్‌నగర్ కూడలిని విస్తరించాల్సి వచ్చింది. మున్సిపాలిటీతోపాటు సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని డిగ్రీ కళాశాల వరకు డివైడర్ నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. అధికారుల్లో ప్రణాళిక లోపించడంతో కూడలి మధ్య రింగ్‌ను విశాలంగా నిర్మించడంతో రహదారి ఇరుకైంది. ఫలితంగా చిరు వ్యాపారుల వద్ద వాహనాలు నిలిపే స్థలం కూడా లేకుండా పోయింది. దీనికి తోడు రహదారి ఇరుకుగా మారగా భారీ వాహనాలు ఢీకొంటుండగా రింగ్ పూర్తిగా ఛిద్రమైపోతోంది.

మూత్రశాలలేవీ?

నిత్యం వందల సంఖ్యలో జనం రాకపోకలు సాగిస్తుండటంతో సుభాష్‌నగర్ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. బస్సుల కోసం వేచి ఉండే, సుదూరం ప్రయాణం చేసి వచ్చిన వారికి ఇక్కడ మూత్రశాలలు కనిపించవు. పురుషులు సమీప ఖాళీ ప్రదేశాల్లో అవసరాలు తీర్చుకుంటున్నా... మహిళల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. సమస్యను అధిగమించేందుకు ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా వినియోగించుకోవడంలో పంచాయతీ పాలకవర్గం విఫలం కాగా నిధులు వెనక్కి వెళ్లాయి. కాగా, సుభాష్‌నగర్‌లో రోడ్డు వెడల్పు చేయకముందు రెండు బస్‌షెల్టర్లు ఉండగా.. కాలక్రమేణా ఆక్రమణకు గురయ్యాయి. ఆ తర్వాత ఆర్టీసీ అధికారులు ఒక బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసినా రోడ్డు వెడల్పు చేశాక రహదారి ఇరుకుగా మారడంతో అధికారులు వీటి పునరుద్ధరణకు సాహసించలేదు. ఏడాది క్రితం ఇల్లెందుకు పలు బస్‌షెల్టర్లు మంజూరయ్యాయి. అందులో రెండింటిని సుభాష్‌నగర్‌కు కేటాయించగా... ఒకటి దూరంగా నిర్మించి మరొకటి వదిలేశారు. ఫలితంగా ఎండా, వనాల్లోనూ ప్రయాణికులు రహదారులపైనే పడిగాపులు పడాల్సి వస్తోంది.

అంధకారం.. దుమ్ము, ధూళి

భారీ వ్యయంతో డివైడర్, రింగ్ నిర్మించిన అధికారులు నిధుల కొరతను సాకుగా చూపి సెంట్రల్ లైటింగ్‌ను విస్మరించారు. మున్సిపాలిటీకి మంజూరైన నిధులతోనే కొనసాగింపుగా కొద్ది ప్రాంతం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినా వాటి నిర్వహణను గ్రామపంచాయితీ విస్మరించడంతో రాత్రయితే ఇక్కడ అంధకారం అలుముకుంటోంది. ఇక మిషన్ భగీరథ పైపుల లీకేజీతో తరచుగా రోడ్డు తవ్వకాలు చేపడుతుండడం, భారీ వాహనాల రాకపోకలతో ఇక్కడ రహదారి ఛిద్రమైంది. దీంతో వాహనాలు వచ్చివెళ్లినప్పుడల్లా దుమ్ము లేవడం సర్వసాధారణమైంది.

తీవ్ర ఇబ్బంది పడుతున్నాం..



ఇక్కడ దశాబ్దాలుగా బడ్డీ కొట్టు నడుపుతున్నాను. పాలకులు మారుతున్నా సమస్యలు తీరడం లేదు. ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్న మహిళలు అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పబ్లిక్ టాయిలెట్లు నిర్మించి ఇబ్బందులు తీర్చాలి.

–యాటకూరి లీలావతి, చిరు వ్యాపారి, సుభాష్‌నగర్, ఇల్లెందు మండలం.

రహదారి ఇరుకైంది..



కూడలిలో రింగు విశాలంగా నిర్మించడంతో రహదారి ఇరుకుగా మారింది. భారీ వాహనాలు వచ్చిన సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్‌షెల్టర్ లేక రోడ్డుపైనే వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు తక్షణం స్పందించి రింగ్ వెడల్పును తగ్గించడంతో పాటు బస్‌షెల్టర్‌ను కూడా నిర్మించాలి.

–బన్నీ, చిరు వ్యాపారి, సుభాష్‌నగర్, ఇల్లెందు మండలం

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



కూడలిలో డివైడర్, రింగు ఏర్పాటు చేసిన అధికారులు సెంట్రల్ లైటింగ్‌ను మరిచారు. గ్రామపంచాయతీ అధికారులు రెండు లైట్లు ఏర్పాటు చేసినా ఆ వెలుతురు సరిపోవడం లేదు. దీంతో దుకాణాలను త్వరగా మూసివేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి.

–వజ్జ శారద, చిరు వ్యాపారి, సుభాష్‌నగర్, ఇల్లెందు మండలం

క్లుప్తంగా

బాలోత్సవ్ బ్రోచర్లు ఆవిష్కరణ



బ్రోచర్లు విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

కొత్తగూడెంరూరల్: జిల్లాలో ఈ నెల 26 తేదీ నుంచి 28 వరకు నిర్వహించే తెలంగాణ బాలోత్సవ్ బ్రోచర్లను ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ బాలోత్సవ్ ఎంతోగానో ఉపయోపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ జీఎం అందెల ఆనందరావు, ఎస్‌జీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ డివిజన్ కార్యవర్గం ఎన్నిక



టీఎన్జీవోస్ డివిజన్ నూతన కమిటీ

పాల్వంచ: టీఎన్జీవోస్ పాల్వంచ డివిజన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, కార్యదర్శి సాయిభార్గవ్‌చైతన్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. డివిజన్ నూతన అధ్యక్షుడిగా వీవీఎస్ఎన్ రాజు, కార్యదర్శిగా నరసింహారావు, కోశాధికారిగా రాంబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా జె.పవన్, జాయింట్ సెక్రటరీగా వి.నితిన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.కల్యాణ్, పబ్లిసిటీ సెక్రటరీగా డి.దమయంతి, ఆఫీస్ సెక్రటరీగా టి.విజయ్‌బాబు, ఈసీ మెంబర్‌గా కె.రమాదేవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జి.వీరబాబు, సీహెచ్.రామనర్సయ్య, జె.సోమయ్య, ఎ.సతీశ్‌బాబు, సాధు, మధు, అంజలి, బాలకృష్ణ, వెంకటరత్నం, రాహుల్, రంగారావు పాల్గొన్నారు.

పంట రుణాలు మంజూరు చేయాలని ధర్నా

ఇల్లెందురూరల్: అర్హులైన రైతులందరికీ పంట రుణాలు సకాలంలో చెల్లించాలని కోరుతూ ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం యూనియన్ బ్యాంకు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు చంద్ర అరుణ మాట్లాడుతూ.. కారేపల్లి మండలానికి చెందిన 800 మంది రైతులకు పంట రుణాలు ఇచ్చిన అధికారులు ఇల్లెందు మండలంలో మాత్రం 60 మందికే ఇచ్చారని, కేవలం లంచాలు తీసుకొని పంట రుణాలు మంజూరు చేస్తున్నట్లు తమ వద్ద బలమైన ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. బ్యాంకులో పంట రుణాల కోసం వచ్చిన రైతులకు టోకెన్ సిస్టం పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. బ్యాంకులో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అదే సమయంలో బయటకు వచ్చిన బ్యాంకు అధికారులు తమపై అభూతకల్పనతో కూడిన ఆరోపణలు చేస్తున్నారని, తమ మెడలు వంచి రుణాలు మంజూరు చేయిస్తామని కరపత్రాలు వేయడం ఏంటని నిలదీశారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీర బిచ్చా, బోసు, పాయం వెంకన్న, ఆవుల కిరణ్, రామ్మూర్తి, భాస్కర్, దేవా పాల్గొన్నారు.

అడవిని కాపాడుకుందాం

టేకులపల్లి: అడవి, అటవీ సంపద మానవాళికి ఇచ్చిన ప్రకృతి వరమని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టేకులపల్లి ఎఫ్ఆర్ఓ ఎండీ ముక్తార్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కిష్టారం బీట్ కొప్పురాయి పంచాయతీ ఇప్పలచెలక గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో అడవిలోకి వెళ్లేవారు అగ్నికి సంబంధించిన వస్తువులు తీసుకెళ్లొద్దని, పంట వ్యర్థాలను కాల్చేటప్పుడు అడవివైపు మంటలు విస్తరించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అడవిలో మంటల నివారణకు సహకరించాలని కోరారు. అడవి జంతువులను వేటాడొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ బి.కృష్ణ, ఎఫ్ఎస్ఓలు బి.శ్రీను, బి.దేవ్‌సింగ్, ఎఫ్‌బీఓలు బి.పవన్‌కుమార్, బి.హత్తిరాం, ఎం.మోహన్, డి.రామ్మూర్తి, ఎస్.నగేశ్, బి.రాంసింగ్, ఎ.గాంధీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరపాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉమెన్స్ జూనియర్ కళాశాలలో ల్యాబ్ అటెండర్ పోస్టుల నియమకాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

అతిథి అధ్యాపకులను ఆదుకోండి..

ఇల్లెందు: పదేళ్లుగా అతిథి అధ్యాపకులుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని, మధ్యంతర ఉత్తర్వులను అమలు చేసి అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాల అతిథి అధ్యాపకులు వేడుకున్నారు. మంగళవారం వారు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నప్పటికీ 7, 8 నెలల వేతనం మాత్రమే అందుతోందని వాపోయారు. ఎం.రజని, పి.వెంకటరమణ, వెంకటేశ్వరరావు, కావ్య, ఉషారాణితో పాటు ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

సుజాతనగర్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె సూచించారు.

విచారణ జరపాలి

టేకులపల్లి: ఈ నెల 3న రాత్రి భువనగిరి ఎస్సీ హాస్టల్ విద్యార్థులు గాదె వైష్ణవి, కోడి భవ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని, ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకుని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి గణేశ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

చివరి రోజు 4,197..

పాల్వంచరూరల్: పట్టభద్రుల ఓటు హక్కు నమోదుకు చివరి రోజు 4,196 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ నాగరాజు మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 4,107, మాన్యువల్‌గా 90 దరఖాస్తులు వచ్చాయని ఆయన చెప్పారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సూర్యం



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

ఇల్లెందు: ఈ నెల 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి కె.సూర్యం కోరారు. మంగళవారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను తుంగలో తొక్కి నాలుగు కోడ్‌లను అమలు చేస్తోందని తెలిపారు. దేశంలోని సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా దారాదత్తం చేస్తోందని, వ్యూహాత్మక విక్రయాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ) పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ప్రైవేటీకరిస్తోందని ఆరోపించారు. ఇలాంటి అనేక అంశాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.రామయ్య, యాకూబ్‌షావలి, పెద్దబోయిన సతీశ్, గోపాల్‌రావు, సుందర్, మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య, పాయం వెంకన్న, వేముల గురునాథం, మల్సూర్, రాజశేఖర్, నిర్మల, రాంబాబు, శాంతయ్య పాల్గొన్నారు.

కేంద్రానికి కనువిప్పు కలగాలి..

సింగరేణి(కొత్తగూడెం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని, తద్వారా కేంద్రానికి కనువిప్పు కలిగించాలని విపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సమ్మె, బంద్ ప్రచారంలో భాగంగా మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడగా పలు పార్టీల నాయకులు అన్నవరపు కనకయ్య, నాగా సీతారాములు, కెచ్చర్ల రంగారెడ్డి, తుపాకుల నాగేశ్వరరావు, మల్లెల రామనాథం, ఏపూరి బ్రహ్మం, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం శేషగిరిభవన్‌లో ఆవిష్కరించారు.

రిజర్వేషన్ అమలు చేయాలని వినతి




కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎస్సీ రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (ఎస్సీహెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రియాంక ఆలకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. తొలుత కేఎస్ఎం నుంచి ప్రదర్శన నిర్వహించాక శ్రీనివాస్ మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసించే లక్షలాది మంది ఎస్సీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలకు తొలగించిన స్థానిక ఎస్సీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కాకెల్లి సైమన్, రజిని, ఇనుముల వెంకటేశ్వర్లు, జిమ్మిడి సడలమ్మ, కత్తి బాలకృష్ణ, కండే రాములు, కండే మనోహర్, బోడ ముత్తయ్య, దారా శ్రీనివాస్, సోంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బృహత్తర ప్రణాళిక రూపొందించండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మనుగడకు బృహత్తర ప్రణాళిక రూపొందించాలని కోరుతూ కొత్తగూడెం వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోరిశెట్టి భవానీప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంలో కలెక్టర్, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో పల్లపోతు శ్రీనివాస్, హన్స్‌రాజ్ జకోటియా, మహ్మద్ అబీద్‌హుస్సేన్, ముక్కా మధుసూదన్‌రావు, బోగా ప్రేమ్‌కుమార్, అనూప్ ఖండేల్వాల్, మనీశ్‌కుమార్ అగర్వాల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ఎంపికైన బాలురతో అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని సెయింట్ జేవీఆర్ హైస్కూల్ ఫాదర్ బాలస్వామి, సిస్టర్ జోష్మి అన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలుర ఎంపికలు పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఉద్యోగం కూడా సంపాదించుకోవచ్చని తెలిపారు. ఇక్కడ ఎంపిక చేసిన వారిని ఈ నెల 10, 11 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. ఎంపికైన వారిలో సీహెచ్.కుశల్, ఉమామహేశ్వరరావు, దుర్గాసాయి, అన్వేష్, విల్సన్‌నాయక్, శశిధర్, హర్షవర్ధన్, బాలాజీ, భరత్, అన్వేష్, ప్రేమ్‌కుమార్, రవీందర్, వెంకటేష్, కృష్ణవిజయసాయి, కౌశిక్, వివేక్‌సాయి ఉన్నారు. నవీన్‌కుమార్, సాయితేజ, పృథ్వీ ఉన్నారు.

పాన్, కిరాణా షాపుల్లో విస్తృత తనిఖీలు



జూలూరుపాడు: కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ

కొత్తగూడెంటౌన్/ఇల్లెందు/జూలూరుపాడు/పాల్వంచ: జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలను నియంత్రించడమే లక్ష్యంగా పోలీసులు రంగంలోకి దిగారు. ఈ మేరకు మంగళవారం పాన్‌షాపుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. కొత్తగూడెంలోని పాన్‌షాపుల్లో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యాన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పాన్‌షాపుల యజమానులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు గంజాయి, మాదకద్రవ్యాలను అమ్మితే తీసుకునే చర్యలను వివరించామని తెలిపారు. అలాగే, ఇల్లెందులోని పాన్‌షాపుల్లో సీఐ కరుణాకర్, ఎస్ఐలు అప్పారావు, రవూఫ్ ఆధ్వర్యాన సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు భారీమొత్తంలో గుట్కాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇక జూలూరుపాడులోని షాపుల్లో సీఐ ఎం.శ్రీనివాస్, ఎస్ఐ జీవన్ రాజు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. పాల్వంచలో సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐ బాణాల రాము ఆధ్వర్యాన తనిఖీలు జరిగాయి.

సమస్యలు పరిష్కరించాలి



డైరీ అందిస్తున్న ఉద్యోగులు

పాల్వంచ: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కేవీ జాన్సన్, కోడూరి ప్రకాశ్, రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేశ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీని కలిసి నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఎండీ యూసుఫ్, పి.రాములు పాల్గొన్నారు.

సుదిమళ్లలో యజ్ఞం

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీ హనుమాన్ ఆలయంలో గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో మంగళవారం తొమ్మిది కుండల గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. లోక కల్యాణం, వాతావరణ కాలుష్య నివారణ కోసం యాగం నిర్వహించినట్లు గాయత్రీ పరివార్ జిల్లా సమన్వయకర్త సతీశ్‌ఖండేల్‌వాల్ తెలిపారు.

రోడ్డుకు శంకుస్థాపన

ఇల్లెందు: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రింగ్ రోడ్డు మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంతో కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగమని తెలిపారు. సకాలంలో పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను కోరారు.

యంత్రాల పనితీరుపై అవగాహన



ఇల్లెందు: మాట్లాడుతున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని జేకేఓసీ, సింగరేణి వైద్యశాలలో మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్స్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉద్యోగులందరికీ సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, సింగరేణిలో వాడుకలో ఉన్న యంత్రాల పనితీరు, ఉత్పత్తి వ్యయంపై ఏరియా జీఎం జాన్‌ఆనంద్ వివరించారు. మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ ఏర్పాటు చేయటం వల్ల అందరికీ కంపెనీ పనితీరు, ఆయా విభాగాల్లో లక్ష్యాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షులు శివప్రసాద్‌తోపాటు గిరిధర్‌రావు, బొల్లం వెంకటేశ్వర్లు, నరసింహరాజు, జీవీ మోహన్ రావు, మధుబాబు, మల్లారెడ్డి, పూర్ణచందర్, నజీర్ అహ్మద్, జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రమాదాలు లేకుండా ఉత్పత్తి సాధించండి..

సింగరేణి(కొత్తగూడెం): ఏరియాలోని ఏకైక భూగర్భగని పీవీకేలో ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని కొత్తగూడెం ఏరియా ఎస్ఓటూ జీఎం జీవీ కోటిరెడ్డి కోరారు. మంగళవారం ఏరియాలోని పీవీకే–5 ఇంక్‌లైన్‌లో మల్టీ డిపార్ట్‌మెంట్ టీం సభ్యుల సమావేశం ఏరియా జీఎం శాలేంరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గనిలో గైర్హాజరు శాతం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నామని, యాజమాన్యం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ కార్మికులు పూర్తిస్థాయిలో సహకరించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్.యోహాన్, హనాసుమలత, శివకేశవరావు, బి.రవీందర్, పాలడుగు శ్రీనివాస్, కేఆర్ నాగభూషణం, సయ్యద్ షాకీర్ మొయినుద్దీన్, అజయ్ పాల్గొన్నారు.

పరుష పదజాలంతో మాట్లాడొద్దు..

బాల్క సుమన్‌ను హెచ్చరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



మాట్లాడుతున్న కోరం కనకయ్య

ఇల్లెందు: ఒకసారి ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన బాల్క సుమన్ సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం సరికాదని, నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన సమాధానం చెబుతామని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చాటుమాటుగా ఎన్నిక కాలేదని, ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే పీఠం ఎక్కాడన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండు నెలలు కూడా పూర్తి కాలేదని, అప్పుడే అధికారం కోల్పోయిన బాధ బీఆర్ఎస్‌లో స్పష్టంగా కనిపించిందని తెలిపారు. సోనియా గాంధీ ఆనాడు తెలంగాణ ఇస్తే కేసీఆర్ సీఎం అయ్యాడని, ఈ రోజు ఆరు గ్యారంటీలు ప్రకటించి అమలు చేయబోతుంటే తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు డానియేల్, పులి సైదులుతోపాటు గింజల నర్సిరెడ్డి, దనియాకుల రామారావు, ఈసం నర్సింహారావు, భూక్యా నాగేశ్వరరావు, అక్కిరాజు గణేశ్, జాఫర్, సీహెచ్ శ్రీనివాస్, ముక్తి కృష్ణ, ఎరసంగి వెంకన్న, సైదులు, తాటి భిక్షం పాల్గొన్నారు. అనంతరం బాల్క సుమన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

కొత్తగూడెంరూరల్: సీఎం రేవంతర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తగిన బుద్ధి చెబుతామని టీపీసీసీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు, ఎస్సీ సెల్ కన్వీనర్ ఏబీ శౌరి హెచ్చరించారు. పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండలు వేసి, ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో గద్దం రాజశేఖర్, మహ్మద్‌గౌస్, పెగడ భిక్షపతి, గాండ్ల సురేశ్, ఉస్మాన్ అలీ, లాల్‌సింగ్‌నాయక్, భద్రం, వినయ్, జయప్రకాష్, సాయి, సంతోష్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొత్తగూడెం ఏడీఈ (ఆపరేషన్స్) హేమచంద్రబాబు మంగళవారం ప్రకటించారు. బర్మాక్యాంప్, బాబూక్యాంపు, బర్లీఫిట్, సన్యాసిబస్తీ, మధురబస్తీ, బస్టాండ్ ఏరియా, రామాటాకీస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లావుడ్యా సోనీ

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లావుడ్యా సోనీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. రాబోయే వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీపీ సోనీ అధికారులను కోరారు. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులను అధిగమించే విధంగా చూడాలన్నారు. తొలుత పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో గాదె నిర్మల, తాళ్లూరి రవి, బానోత్ నీల, పెండ్యాల రాజశేఖర్, లక్ష్మీనర్సమ్మ, బానోత్ సక్కుబాయి, శివయ్య, సురేష్, సత్యనారాయణరాజు, రవికుమార్, లక్ష్మీనర్సు, పూర్ణచందర్‌రావు, ప్రకాష్, లక్ష్మీ, నాగమణి, శకుంతల, నాగశ్రావణి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.